వీధి వ్యాపారుల తరలింపు

- గాంధీ గంజ్‌లోనే విక్రయాలు నిర్వహించాలని సూచించిన అధికారులు

సుభాష్‌నగర్: నగరంలోని గాంధీగంజ్‌కు ఇరువైపులా కూరగాయలు విక్రయించే వీధి వ్యాపారులను మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది బుధవారం ఉదయం తరలించారు. ఇక నుంచి గాంధీగంజ్ లోపల కూరగాయలు విక్రయించాలని వారికి సూచించారు. ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సంయుక్తంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో కూరగాయల వీధి వ్యాపారులను తరలించాలని నిర్ణయానికి వచ్చారు. అందులోభాగంగా మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది ఉదయమే అక్కడికి చేరుకుని గాంధీగంజ్‌కు ఇరువైపులా వీధి వ్యాపారులు కూరగాయలు విక్రయించకుండా చర్యలు చేపట్టారు. వీధి వ్యాపారులు సైతం స్వచ్ఛందంగా లోపల కూర్చొని అధికారులకు సహకరించారు. గోదాం రోడ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయడం పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కూరగాయల వీధి వ్యాపారులను తరలిస్తున్న అధికారులు



గాంధీగంజ్ లోపల కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు.. పర్యవేక్షిస్తున్న మార్కెట్ కమిటీ అధికారులు

సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

ధర్పల్లి: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో తప్పులు లేకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంతోపాటు హొన్నాజీపేట్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వివరాలు తీసుకోవాలని అన్నారు. సర్వేపై ప్రజలకు సందేహాలు ఉంటే ఎన్యుమరేటర్లు నివృత్తి చేయాలన్నారు. ప్రజలు అపోహలకు పోకుండా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి, ఏపీఎం సునీత ఉన్నారు.


ధర్పల్లిలో సర్వే తీరును పరిశీలిస్తున్న శ్రీనివాస్

అమరవీరుల సంస్మరణ సభ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఆనంద నిలయంలో బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తిని నేటి విద్యార్థులు అలవరుచుకోవాలన్నారు. శాస్త్రీయ విద్యావిధానం, అసమానతలు లేని సమాజం కోసం పీడీఎస్‌యూ పోరాటాలు చేసిందన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. నాయకులు సాయికిరణ్, జన్నారపు రాజేశ్వర్, రఘు, రాకేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇందల్వాయి: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. బాక్సింగ్ పోటీల్లో గంగామణి ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని, హారిక రెజ్లింగ్, బాక్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానం, జూడో పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. షాట్‌పుట్, అథ్లెటిక్స్‌లో కృష్ణవేణి ద్వితీయ స్థానం సాధించగా, లాంగ్‌జంప్ పోటీల్లో శృతి ద్వితీయ స్థానం, షణ్ముఖప్రియ బాక్సింగ్‌లో ద్వితీయ స్థానం, రెజ్లింగ్‌లో తృతీయ స్థానం సాధించారు. అలాగే పలువురు విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్, టెబుల్ టెన్నిస్ పోటీల్లో తృతీయ స్థానాలు సాధించారు. ఈసందర్భంగా క్రీడాకారులను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

సభా ఏర్పాట్ల పరిశీలన



నిజామాబాద్ సిటీ: మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాందేడ్‌లో గురువారం భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. సభ కోసం ఏర్పాట్ల పనులను రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు అప్పగించారు. ఈసందర్భంగా బుధవారం నాందేడ్‌లో సభాస్థలి ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నుడా చైర్మన్ కేశవేణు, స్థానిక నాయకులతో కలిసి పనులు పరిశీలించారు.

క్లుప్తంగా

వసతిగృహాల తనిఖీ



సిరికొండ: మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఎస్సీ హాస్టల్, మోడల్ స్కూల్ హాస్టల్‌ను బుధవారం తహసీల్దార్ రవీందర్ రావు తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు కూరగాయలను వంట సామగ్రిని తనిఖీ చేశారు. నాణ్యమైన సరుకులను వినియోగించాలని వార్డెన్లకు ఆయన సూచించారు. ఎమ్మార్‌ై గంగరాజమ్ తదితరులు ఉన్నారు

కాళోజీకి ఘన నివాళి



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో బుధవారం కాళోజీ నారాయణరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలోని కాళోజీ విగ్రహానికి జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు తెలంగాణ శంకర్, రంగు సీతారం, కృష్ణ ఉన్నారు.

అన్నదాతల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలు తెరిపించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీతో కాలక్షేపం చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీలు తెరిపించి కార్మికులు, రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నాయకులు సాయిరెడ్డి, పర్వయ్య, దేవన్న పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్ తనిఖీ



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ఖిల్లా వద్దగల మినీ ట్యాంక్‌బండ్, రఘునాథ చెరువును మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఖిల్లా ఏరియాలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ట్యాంక్‌బండ్ వద్ద తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వసతి మెరుగుపర్చాలని సిబ్బందికి సూచించారు. ట్యాంక్‌బండ్‌పై సందర్శకులకు ఆహ్లాదం కలిగేలా వాతావరణం ఉండాలని అన్నారు. చెత్తాచెదారం వెంటవెంటనే తొలగించాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, జవాన్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

డీఈవోకు వినతి



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని డీఈవో అశోక్‌ను బుధవారం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. ఏఎన్ఎం పోస్టుల భర్తీలో కేజీబీవీలో పనిచేసిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అనేక సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలకే వీరు పని చేశారన్నారు. రిటైర్మెంట్ వయసు 65ఏళ్లకు పెంచాలన్నారు. కేజీబీవీల్లో పనిభారం పెరిగిందని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల ధర్నా

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బుధవారం డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సబ్ రిజిస్ట్రార్ లే-అవుట్ ప్లాట్‌లను పార్ట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని, ఒక డాక్యుమెంట్ చేయడానికి రెండు గంటల సమయం పడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయడంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రియల్టర్లకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రియల్టర్లు గంగారెడ్డి, మహేందర్, డాక్యుమెంట్ రైటర్స్ ప్రశాంత్, భాస్కర్ ఉన్నారు.

ఆధ్యాత్మికం..

నిత్యాన్నదానం ప్రారంభం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప మాలాధారులకు నిత్యభిక్ష కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతో ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో సబ్‌కలెక్టర్, ట్రస్టు ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనవరి 1వరకు నిత్య బిక్ష ఏర్పాటు చేశామని, మొదటిరోజు బిక్షను పల్లెపాటి శ్రీధర్ ఏర్పాటు చేశారని ట్రస్టు అధ్యక్షుడు శివన్నారాయణ తెలిపారు. అన్నదాత కమిటీ అధ్యక్షుడు కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, సభ్యులు మాటూరి ప్రసాద్, పావులూరి వెంకటేశ్వర్‌రావ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్టపై గిరి ప్రదక్షిణ



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం లింబాద్రి గుట్టపై బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగిస్తూ భక్తులు గుట్ట చుట్టూ స్వామివారిని స్మరించుకుంటూ ప్రదక్షిణ చేశారు. భీమ్‌గల్‌తో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కరీంనగర్ జిల్లా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడి పూజలు

బాల్కొండ: లింబాద్రి గుట్టపై బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద పల్లకి సేవలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలని దేవున్ని వేడుకున్నట్లు తెలిపారు.



బాల్కొండకు చేరిన జైనమత గురువుల పాదయాత్ర

బాల్కొండ: జైనమత గురువు ప్రసన్న సాగర్ ఆధ్వర్యంలో బెంగుళూర్ నుంచి బద్రీనాథ్ వరకు చేపడుతున్న జైన మత గురువుల పాదయాత్ర బుధవారం బాల్కొండ మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడ ఓ ఫంక్షన్ హాలులో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. కిసాన్‌నగర్, ముప్కాల్, మీదుగా పాదయాత్ర కొనసాగింది. భక్తులు పాదయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఘనంగా పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్ జన్మదిన వేడుకలు



మోపాల్/నిజామాబాద్ సిటీ: నగరంలో బుధవారం టీపీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కేక్ కట్ చేయగా, పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఇమ్మడి గోపి, కాలూరు భోజన్న, గంగాప్రసాద్, ఉమ్మాజీ నరేష్, నవీన్ గౌడ్, చిన్న బాల్‌రాజ్, సుదర్శన్‌రెడ్డి, లింగం, మహేందర్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శేఖర్‌గౌడ్ దంపతులు పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మాజీ మేయర్ ఆకుల సుజాత, మాజీ కార్పొరేటర్లు ఇతర నాయకులు ఆయన నివాసంలో కేక్ కట్ చేయించారు.

గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలి

సిరికొండ: మండలంలో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సిరికొండ ఎస్సై ఎల్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలు, డబ్బులు గానీ ఉంచుకోవద్దని తెలిపారు. వేరే గ్రామాలకు వెళ్లేటప్పుడు తాళం జాగ్రత్తగా వేసి పక్కింటి వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏదైనా ఇబ్బంది కలిగితే 100కు కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం స్థానిక నాయకులు పంపిణీ చేశారు. నాయకులు జక్కం బాలకిషన్, గంగారెడ్డి, వసంతరావు, గన్న లక్ష్మణ్, గడ్డం సంజయ్, అక్బర్, గన్న సూరి, రహమత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ బుధవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి, సన్మానించారు. అనంతరం వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించి వారు చర్చించారు. నాయకులు సుభాష్ జాదవ్ తదితరులు ఉన్నారు.

టీచర్లపై ఒత్తిడి తగ్గించాలి

నిజామాబాద్‌అర్బన్: సమగ్ర సర్వే పేరిట టీచర్లపై ఒత్తిడి పెంచడం సరైంది కాదని, వారిపై పని ఒత్తిడిని తగ్గించాలని పీఆర్టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేలో టీచర్లపై అధికారులు ఆగమేఘాలమీద ఆదేశాలు జారీ చేస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్య బోధన చేపట్టి అనంతరం సర్వేకు వెళ్లడంతో కేటాయించిన ఇళ్ల కంటే తక్కువగా సర్వే చేస్తున్నారన్నారు. కానీ అధికారులు టార్గెట్ పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

బోధన్: ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ అన్నారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ సభ్యత్వం పొందిన వారికి రశీదులు అందించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. నాయకులు శేఖర్, పోల శ్రీనివాస్, దినేష్‌బాబు, జనార్దన్, జాకీర్, జాఫర్, ఉమాకిరణ్, సాయిలు బాగౌడ్ పాల్గొన్నారు.

నేటి చిత్రం


నగరంలోని రహదారిపై ఉన్న ఆవులు

రోడ్లపై పశువులు.. వాహనదారులకు తిప్పలు

నిజామాబాద్ నగరంలో ప్రధాన రోడ్లమీద మూగజీవాలు సంచరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పశువులు రోడ్లనే ఆవాసాలుగా చేసుకుంటున్నాయి. గంటల తరబడి ఆవులు, ఎద్దులు రోడ్లమీద పడుకుంటున్నాయి. రహదారిపై పశువుల సంచారంతో వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. –నిజామాబాద్ సిటీ

కఠిన చర్యలు తీసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై నిరసన తెలిపిన ఏబీవీపీ నాయకులపై దాడికి పాల్పడిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాకేష్‌తో పాటు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. వర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది దాడిలో సాయికుమార్ అనే ఏబీవీపీ కార్యకర్త తల పగిలి, ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. మరో 8మంది ఏబీవీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయాలపాలైనా నిందితులపై చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అమృత్‌చారి సమీర్, మోహన్, అక్షయ్, లెనిన్, సాయినాథ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


నగరంలో ధర్నా నిర్వహిస్తున్న టీజీవీపీ నాయకులు, విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం నగరంలో ర్యాలీ, ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోవడంతో పేద విద్యార్థులు చదువుపై ఆశలు వదులుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నాయకులు అఖిల్, వినయ్, సుజిత్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



ఎడపల్లి(బోధన్): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులకు సూచించారు. మండలంలోని ఠానాకాలన్ సింగిల్ విండో సబ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ.. ఎడపల్లి సింగిల్ విండో పరిధిలో ఇప్పటివరకు 20వేల బస్తాలను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో విఠల్, వినోద్, రాజారామ్, రైతులు ఉన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,100	వెండి(కిలో)	95,000
22 క్యారెట్స్	72,056		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	30	గాజరుగడ్డ	50	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	35	60
చిక్కుడుకాయ	50	80	గోబిగడ్డ	30	60
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	90
వంకాయ	50	75	బీట్‌రూట్	50	90
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	60	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మట్కా (తెలుగు)-10.25,4.35, 10.40; లక్కీ భాస్కర్(తెలుగు)-1.40,7.35
స్క్రీన్-3	అమరన్(తెలుగు)-1.25 7.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ తెలుగు-9.30,12.50, 4.10,7.30,10.50
స్క్రీన్-2	మట్కా(తెలుగు)-12.10,3.35,7.00, 10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 9.50; క(తెలుగు)-4.00; అమరన్(తెలుగు)-7.15,10.45
స్క్రీన్-4	భూల్ భులయ్యా (హిందీ)=10.00 7.05 - వంచన(తెలుగు)-1.25; బ్లడీ బెగ్గర్(తెలుగు)-4.05; సింగం అగైన్(హిందీ)-10.30
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

పాఠశాలలో కంటివైద్య శిబిరం

రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి, నీలా, కందకుర్తి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యులు విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, వైద్యసిబ్బంది రవీందర్, మల్లయ్య, ఉజ్మా, రామకృష్ణ, చిన్నయ్య, రాణి పాల్గొన్నారు.